ఓం నమోభగవతే శ్రీ రమణాయ

శ్రీ భారతీ దేవ్యైనమః

# ఉమాసహస్రము

## (చతుర్థశతకమున - తృతీయ స్తబకము)

## పంచదశస్తబకము

అవ:- పదునైదవది యగు నీ స్తబకమున దేవీ వైభవమును ప్రసంగించి ఇపుడు - తద్ ధ్యాన ప్రకారమును ప్రస్తావించు చున్నాఁడు. ( ఈయంశములు - శ్రీ గణపతి మునీంద్రుల స్వానుభవములని తెలియునది)

మూ॥ ఆపదామపహరన్తు తతింనః
సమ్పదామపి దిశన్తు సమృద్ధిమ్।
దన్త కున్ద రుచి దత్తబలాని
వ్యోమ కేశ సుదృశో హసితాని ॥ 1

శివుఁడు వ్యోమకేశుఁడు. ఆవ్యోమ కేశునికాంత- పార్వతి. మల్లెపూవులను బోలినదంతముల కాంతులుగల శ్రీ పార్వతీహసితములు మా యాపదలనన్నిటిని తొలఁగించుగాక! సంపదలనన్నిటిని సంఘటించుఁగాక।

**ప్రభ:**- వ్యోమమనఁగా, ఆకాశము. ఆకాశమే జుట్టుగాఁగల శివుఁడు వ్యోమకేశుఁడు ఆ వ్యోమకేశుని కాంతయగు ఉమాదేవి దంతములు మల్లెపూవులవలె నుండును. ఆదంతముల కాంతులు మాకు బలమునిచ్చునని చెప్పుటచేత - ఆహసితములు - శుభ్రవములనియు, శోభావహములనియు, స్ఫురింప



ఁజేయఁబడుచున్నవి. ''హసితములు'' అనుచోటనున్న బహువచనము చేత - అవి క్షణ క్షణమునందును విలసిల్లుచుండుటయు, మందములగుచుండుటయు, ధ్వనితము. ఆపదలను నివారించి, సంపదలను సంఘటించునవియగు దేవీమందహసితములు - ఈస్తబకము యొక్క ప్రారంభమునందుఁగూడ నిట్లుస్తుతింపఁబడినవని తెలియునది.

మూ॥ అల్పమప్యధిక శక్తి సమృద్ధమ్
మన్ద మప్యధిక సూక్ష్మవిసారమ్।
సుస్మితం స్మరవిరోధి రమణ్యాః
కల్పతాం మమకులస్య శుభాయ ॥ 2

అల్పమయినను - అనల్పశక్తి సమృద్ధమును, మందమయినను - అధికసూక్ష్మ విసారమును, అగు కామారిరమణీ సుస్మితము - మాకులమునకు శుభము నొసఁగుగాత।

**ప్రభ:**- అనల్పశక్తి సమృద్ధము = అనల్పమగు = ఎక్కువయగు శక్తిచేత, పూర్ణము మందము - అలసము. అధిక సూక్ష్మవిసారము = మిక్కిలి సూక్ష్మమగుచున్నను ప్రబలమగు వేగము చేత స్థూలదృష్టికిఁగూడ గోచరమగు ప్రసారముగలది. కామారిరమణీ, సుస్మితము = కామునకు శత్రువగు శివునియోషయగు పార్వతియొక్క సుస్మితము = శోభనమందహసితము. అల్పమయినను = అనల్పశక్తి గలదియు, మందమయినను అమందమయిన ప్రసారముగలదియు అగుచు సకలకుల మంగలాధాన సమర్థమగు దేవీమందస్మితము ప్రార్థింపఁబడినది. ఆ సుస్మితము - కామ - విరోధికిఁగూడ - కామాధాయిని యనునర్థము వలన మూలమునందలి 'స్మర విరోధిరమణీ' పదము (కామారి రమణిఅగు పదము) సాభిప్రాయమగుచున్నది. ఇట్లు - అంతటనుగూడ అన్యోన్యవిరోధమే చెప్పఁబడినది. మీఁదివిరోధము - సుస్మిత ప్రభావము వలన పరిహరింపఁబడుచున్నది. కావున నిది విరోధాభాసాలంకారమగును.

''హేతూనామసమగ్రత్వే కార్యోత్పత్తిశ్చసామతా''

సంపూర్ణమగు హేతువు లేకున్నను కార్యము కలిగినట్లు చెప్పబడినయెడల నదికూడ విభావనయేయగును.'' అను చంద్రాలోక లక్షణము ననుసరించునెడల నిది విభావనాలంకారమగును.

మూ॥ పుష్కరాద్ రవిమతో భువమేతాం
భూమితశ్శశధరం క్రమమాణా।
నైవముఞ్చతిపదం బతపూర్వం
నోత్తరం ప్రజతినేశపురన్ధ్రీ॥ 3

ఈశ్వర పురంధ్రియగు జగన్మాత- పుష్కరము నుండి (పరమ వ్యోమము నుండి) సూర్యమండలమునకును సూర్యుని నుండి భూమికిని భూమినుండి చంద్రమండలమునకును పాదముచేత వెళ్లుచున్నను ముందుంచిన పదమును విడువనే విడువదు. ఉత్తరపదమునకు వెళ్ళకమానదు. ఇది యాశ్చర్యమగుచున్నది.

ప్రభ:- పరమేశ్వరి – సృష్టికాదియగు పరమాకాశము నుండి బయలువెడలి సూర్యునియందు పాదమునుంచును. అక్కడనుండి భూమియందు పాదమునుంచి అచ్చట నుండి చంద్రునియందు పాదన్యాసము నొనర్చుచుండును. ఇట్లు పాదవిక్షేపము నొనర్చునపుడు, మొదట రవియందుంచిన పదమును విడువకయే, ఉత్తరపాదమును భూమియందుంచుచున్నది. ఈ రెంటియందును ఉంచిన పదక్రమమును విడువకయే యెల్లప్పుడును చంద్రమండలమునందుఁగూడ పాదన్యాసము నొనర్చుచుండును. లోకులందఱును పూర్వపదము విడిచియే ఉత్తరపదము నుంచుదురు. పరమేశ్వరి - అసాధారణమగు పదక్రమము కలది. కావున మహాశ్చర్యము నుదయింపఁజేయుచున్నదని భావము. ''భగవతి – ఒక వస్తువును సృజించి, ఇంకొక వస్తువును సృజించునపుడు పూర్వపూర్వసృష్టిని విడవదు. ఉపేక్షింపదు. అది యామహేశ్వరియొక్క అసామాన్యమగు విభూతి'' అని తాత్పర్యము.



మూ॥ భూషణేష్వివ సవిత్రి! సువర్ణం
మృత్తికా మివ ఘటేష్వఖిలేషు
విశ్వవస్తుషు నిరస్తవిశేషాం
దేవి! పశ్యతి సతీంవిబుధస్త్వామ్ ॥ 4

దేవీ! సవిత్రీ! భూషణములయందు సువర్ణమునువలెను, ఘటములయందు మృత్తికనువలెను; సర్వవస్తువులందును నిరస్తవిశేషవగు (నిర్విశేషవగు) నిన్ను – పండితుఁడు – సతినిగా (అభిన్నమగు సత్తా మాత్రముచేత నున్నదానిగా) చూచును.

ప్రభ:- హార – కేయూరాదులగు నాభరణములకు సువర్ణమే స్వరూపమగునట్లు, ఘటాదులకు మన్నేస్వరూపమగునట్లు 'సతి' అను పేరుగల నీవే సర్వమునకును గూడ స్వరూపమైయున్నావు. ''వాచారమ్భణం వికారో నామధేయం మృత్తికేత్యే వసత్యమ్'' ''కుండ, మొదలగు వస్తువులన్నియు వికారములు. అవి మట్టియొక్క పరిణామములు. కావున నవియన్నియు వాక్కుచేఁ దెలుపఁదగిన నామములేకాని సత్యము కావు. వానికి మూలమగు మట్టియే సత్యమయినది'' అని ఛాందోగ్యోప నిషత్తు వాకొనుచున్నది. కావున విశ్వమునందలి వస్తువులన్నియుఁగూడ సతి (సత్తారూపిణి) వగుటవలన సర్వమయివగు నీకంటె వేఱుకానేరవు. కావున పండితుఁడు నిన్ను భేదములేనిదానవగు సతివని తెలియునని భావము. ''విశ్వవస్తుషు నిరస్త విశేషః'' అను వేఱొక పాఠముగూడ గలదు. సర్వవస్తువులయందును నిరసింపఁబడిన భేదము గల (అభేదము నవలోకించు) పండితుఁడు – సతిగా, అనఁగా. ఉనికియే స్వరూపము గాఁగలదానినిగా నిన్ను సాక్షాత్కరింపఁజేసికొనునని దానియర్థము.

మూ॥ కిట్టభూత మఖిలేశ్వరజాయే!
దృశ్యజాతమఖిలం నిజపాకే
ప్రాణ – బుద్ధి – మనసా మిహవర్గః
సారభూత ఇతి సూరిజనోక్తిః ॥ 5

సర్వేశ్వర సహధర్మిణివగు జననీ! స్వీయమగు (నీచేనొనర్పఁబడుచున్న) పచనక్రియ (వంట) యందు - దృగ్ గోచరమగు స్థూలవస్తుజాతమంతయుఁగూడ కిట్ట భూతము ( అసారాంశభూతమగు మలమువలెనున్నది) అగుచున్నది. ఇచట. ప్రాణ - బుద్ధి - మనోవర్గము - సారభూతము అని పండితవచనము గలదు.

**ప్రభ:-** ''కిట్టభూతము'' ''కిట్టం మలేఽ స్త్రియామ్'' అని యమరము. కావున కిట్టమనగా మలము. భూతపదమిచట స్వరూపవాచకము కాని సాదృశ్యపరము కాదు. కావున కిట్టభూతమనఁగా మలము వలె నున్నది అనియర్థము. ప్రాణ - బుద్ధి- మనోవర్గము = ప్రాణముల యొక్కయు, బుద్ధుల యొక్కయు, మనస్సుల యొక్కయు సమూహము. సారభూతము = సారత్వమునొందినది. స్థూలమగు వస్తువంతయుఁగూడ - సారాంశము నావరించి మలము వలె నుండుచున్నది. దానిని వండునపుడు ఒక్కొక్క వస్తువును గూడ దానియందలి సారమును విసర్జించుచుండును. స్థూలము - మలమువంటి స్వరూపముగలదనియు, దానికంటె సూక్ష్మమగునది తత్సారమనియు నభిప్రాయపడి యిట్లు శ్రుతులుద్ఘోషించుచున్నవి. కావుననే మూలమున ''సూరిజనోక్తిః'' (పండిత వచనము గలదు) అని చెప్పఁబడినది.

అదెట్లనిన: -

''పృథివ్యా ఓషధయః ఓషధీ భ్యోఽన్నం, అన్నాత్ పురుషః సవా ఏషపురుషోఽన్నరసమయః'' ''పృథివి నుండి, దానిసారమగు ఓషధులును; ఓషధుల నుండి తత్సారమగు అన్నమును, అన్నమునుండి తత్సారమగు పురుషుఁడును, విసర్జింపఁబడుచున్నారు. ఆ యీ పురుషుఁడు అన్న రసమయుఁడు'' అని తైత్తిరీయశ్రుతి యందు పురుషునకు సారభూతత్వము జెప్పఁబడినది. పృథివ్యా అపోరసః అపామోషధయోరసః, ఓషధీనాం పురుషోరసః పురుషస్యవాగ్రసః, వాచఋగ్ రసః, ఋచః సామరసః సామ్న ఉద్గీథోరసః'' పృథివికి సారము - జలము. జలమునకు సారము - ఓషధులు. ఓషధులకుసారము - పురుషుడు. పురుషునకుసారము - వాక్కు వాక్కునకు సారము - ఋక్కు. (స్తుతి), ఋక్కునకుసారము సామము (అనుభూతి ప్రకటన సమర్థమగు గానము) సామమునకు సారము - ఉద్గీథము, అని ఛాందోగ్యము నందలి ఉద్గీథవిద్యా ప్రస్తావమునఁ జెప్పఁబడినది. దీనివలన స్థూలమునుండి సూక్ష్మమును, సూక్ష్మము నుండి సూక్ష్మతరమును, సారాంశమను నంశము శ్రుతి ప్రోక్తమగుచున్నది. ''అన్నమశితం త్రేధావిధీయతే'' అని యుపక్రమించిన ఛాందోగ్యమునందలి ఆరవప్రపాఠకమున అన్నము యొక్క సారాంశము మనస్సనియు, జలము యొక్క సారాంశము ప్రాణమనియు, తేజస్సు యొక్క సారాంశము వాక్కనియుఁ దెలుపఁబడినది. దృశ్యమగు నీ బ్రహ్మాండమంతయుఁగూడ మనస్థూల దృష్టికి స్థిరమగువస్తువు వలె భాసించుచున్నను, సర్వేశ్వరియగు మహాశక్తి చేత పరిపచ్యమానమై స్వసారమగు ప్రాణాది రూపమున పరిణమించుచునే యుండునను నది కవి హృదయమని గుర్తించునది.

మూ॥ సారమీశ్వరి! తిలేష్విప తైలం
విగ్రహేషు నిఖిలేషునిగూఢమ్
యేధియా మథనతో విదురేకం
తే భవన్తి విబుధా స్త్వయిలీనాః ॥ 6

ఈశ్వరీ! తిలలయందు (నూవులయందు) తైలమువలె సకల శరీరముల యందును, నిగూఢమగు (అంతర్గతమగు) సారమును అనఁగా, స్థిరాంశమగురసమును సూక్ష్మమగు బుద్ధిచేత మథించుట వలన తెలిసికొనిన విద్వాంసులు - నీయందులయించి, నీ స్వరూపమునొందుచుందురు.

**ప్రభ:-** నిగూఢము = గుప్తము, దాచబడినది. 'తిలేషుతైలం, దధనీవసర్పి, రాపః స్రోత స్వరణీషుచాగ్నిః ఏవమాత్మాఽత్మనిగృహ్యతేఽసౌసత్యే నైనంతపసాయోఽనుపశ్యతి॥' (శ్వేతాశ్వతరోపనిషత్ 1 అ 15 శ్లో)

నువ్వులయందు నూనెవలెను, పెరుగునందు నేయివలెను, నదులయందు జలములవలెను, అరణులయందు అగ్నిహోత్రమువలెను, ఎవ్వఁడు ఈయాత్మను (తన్ను) సత్యము చేతను, తపస్సు చేతను, చూచుచుండునో, వానిచేత నీయాత్మ-తన దేహమునందే యీ విధమున గ్రహింపఁబడును. తన శరీరమునందే, అన్నమయమును ప్రాణమయమునందును, ప్రాణమయమును మనోమయమునందును, మనోమయమును విజ్ఞానమయమునందును విజ్ఞానమయమును ఆనందమయమునందును, ప్రవిలాపమును (ఉపసంహారమును) చేయుటవలన పూర్ణానందరూపమయిన స్వాత్మరూపము తెలియఁబడుచుండును. మనస్సునకును - ఇంద్రియములకును గూడ ఏకాగ్రత కలుగుటయే తపము. యథార్థము, ప్రాణిహితమునగు వచనము సత్యము - ఈతపమును, సత్యమును గలవాఁడే- తన శరీరమునందే ఆత్మ సాక్షాత్కారమును బడయునని తెలియునది.

మూ॥ ఆయసం త్రిభువనేశ్వరి! పిణ్డమ్।
వహ్నినేవ తపసా తను పిణ్డమ్।
యస్యచిజ్జ్వలన జాలమయం స్యాత్
తప్తమమ్బ! స త వాలయ భూతః ॥ 7

త్రిభువనేశ్వరీ! అగ్నిచేతప్తమగు, అయఃపిండమువలె, తపస్సుచే తప్తమగునెవ్వని తనుపిండము చిదగ్నిజాల (సమూహ) మయమగుచుండునో, వాఁడు, నీకు - ఆవాసస్థానమగును.

**ప్రభ:-** అయఃపిండము = ఇనుపగుండు, తనుపిండము = శరీరమను ఘనపదార్థము. చిదగ్ని జాలమయము = చైతన్యమనునగ్ని సంహతియొక్క వికారము. అగ్ని జ్వలితమగు లోహపిండము - జ్వలనమయమగునట్లు, తపస్తప్తమగు యోగి శరీరము జ్ఞానజాలమయమగును. ఏయోగికి - ఇట్లు జ్వలితమగు చిన్మయ శరీరముండునో అతఁడే ధన్యుఁడై, నీకు - ఆవాసస్థానమగునని తాత్పర్యము.



మూ॥ యోఽరణేర్మథనతోఽతి పవిత్రమ్
వీతిహోత్రమివ వీతకలఙ్కః
ప్రాణ ముజ్జ్వలయతిస్వశరీరాత్
త్వామసావభయదేహఽతియష్టుమ్ ॥ 8

అభయప్రదవగు దేవి! అపహతకళంకుఁడగు నేపురుషుఁడు - అరణిని మథించుట వలన - అతి పవిత్రమగు అగ్నినివలె, స్వశరీరము నుండి (జీవన హేతువగు) ప్రాణమును, మీదికి జ్వలింపఁజేయుచుండునో, అతఁడు - నిన్ను యజించుటకు (పూజించుటకు) అర్హుఁడగుచుండును.

**ప్రభ:-** యజమానుఁడు - అరణిని మథించి, అగ్ని నుజ్జ్వలింపఁజేసి, యజ్ఞము నొనర్చుటకు - అర్హుఁడగునట్లు - యోగి - తపోబలము వలన శరీరము నుండి ప్రాణమునుజ్జ్వలింపఁజేసియే నిన్ను పూజించుట కర్హుఁడగునని తాత్పర్యము - ఇదియే అంతర్యాగము. భగవతియగు నీశ్వరి - ఈయంతర్యాగము చేతనే సమారాధింపఁదగినదని ప్రతిపాదింపఁబడినది. శరీరమే - అరణి. తపోధ్యానాదికమే-మథనము. కుండలినీ ప్రేరితమగు ప్రాణజ్వాలయే - అగ్ని అని - ఉపమానోపమేయముల నెఱుఁగునది.

స్వదేహమరణిం కృత్వాప్రణంవచోత్తరారణిమ్
ధ్యాననిర్మథనాభ్యాసాద్దేవం పశ్యే న్నిగూఢవత్॥
(శ్వేతాశ్వతరోపనిషత్తు **1-14**)

''విద్వాంసుఁడగు యోగి - తన శరీరమును - అధరారణిగాను, వేదాదియందును, వేదాంతమునందును ప్రతిష్ఠితమగు ఓంకారమును - ఉత్తరారణిగాను, చేసి, ధ్యానమను మథనము యొక్క అభ్యాసముచేత, అరణియందు గూఢమగు అగ్నినివలె, ఆత్మ స్వరూపమును సమీక్షింపవలయును.''

మూ॥ ప్రాణతా శ్వసిత మేవవిచార్యమ్
కుర్వతా కరణమేవ నిభాల్యమ్
గచ్ఛతా గమన మేవ విశోధ్యమ్
తత్తనౌ మథన మాగమ బోధ్యమ్ ॥ 9

ప్రాణనమునొనర్చుచున్న (శ్వాసమునొనర్చుచున్న) జనుఁడు. (యోగి) శ్వసితమునే ( ఊర్పునే) విచారించునది. పనిచేయుచున్న వాఁడు - పనినే సమీక్షించునది. గమించుచున్నవాఁడు - గమనమునే పరీక్షించునది. ఇదియే - (ప్రాణన - కరణ - గమనవిచారణమే) శరీరమునందు - ఆగమబోధ్యమగు మథనమగును. (ఊపిరితీయునపుడు- ఊపిరిని, పని చేయునపుడు పనిని, నడచునపుడు నడకను, పరీక్షించుటయే - వేదోక్తమగు యోగమథనము)

**ప్రభ:-** పూర్వశ్లోకమునందు మథన ప్రసక్తి కలిగినది, కావున దానిస్వరూప మీశ్లోకమున వ్యాఖ్యానింపఁబడినది. ఊపిరిగొనునపుడు ఎట్లు శ్వసించుచున్నాను? ఊర్చుచున్నవాఁడెవ్వఁడు? అని విచారింపవలయును. ఇట్లే, పనిచేయుచున్నప్పుడు ఎవఁడు పనిచేయుచున్నాఁడు? ఎట్లు చేయుచున్నాఁడు? అని బుద్ధిచేత నెఱుఁగవలయును. నడచునపుడు - ఎవఁడు గమించుచున్నాడు? ఎట్లుగమించును? అని యాలోచింపవలయును. ఈ మూడింటిని గూడ నిట్లు పరీక్షించుటయే దేహమున ప్రాణము నుజ్జ్వలింపఁ జేయునదియగు మథనమగునని నిగమాగమతాత్పర్యము. ఇది యొక్కటి గుర్తింపఁదగియున్నది. ఒకడు - పనిచేయుచున్నను, ఎచటికిని పోకున్నను గూడ - ఊపిరి పీల్చుట మానఁడు. అట్లూరక యున్నప్పుడుగూడ ఊర్పును సమీక్షించుచుండుట మథనమేయగును. కావున, ఊరకయున్నప్పుడును, పనిచేయుచున్నప్పుడును పోవుచున్నప్పుడును గూడ - సర్వవిధముల చేతను మథనము నొనర్పవలయునని భావము.



మూ॥ యోరసం పిబతి మూర్ధసరోజాత్
సోమపోఽయమనఘః ప్రయతాత్మా
అగ్నిహోత్రమఖిలేశ్వరి! నిత్యం
మూలకుణ్డ దహనస్థితి రస్య ॥ 10

ఏ యోగి - శిరస్సునందున్న సహస్రారకమలము నుండి స్రవించుచున్న రసమును - ఆస్వాదించునో, ప్రయతాత్ముఁడగు నాయీ యనఘుఁడు - సోమపుఁడు (సోమరసపాయి) అగుచున్నాడు. అఖిలేశ్వరీ! ఈసోమపునకు - మూలాధారమను కుండమునందలి యగ్నిస్థితి - నిత్యమగుట వలన నతఁడు - నిత్యాగ్నిహోత్రుఁడగును.

**ప్రభ:-** ప్రయాతాత్ముఁడు = నియతమగు, అంతఃకరణము లేక, స్వభావము లేక శరీరము గలవాఁడు. అనఘుఁడు = పాపములేనివాఁడు. సోమపుఁడు = సోమమను రసము త్రాగువాఁడు. (లోకమునందొనర్పఁబడు బహిర్యాగమున - నియతకాలము నందు, పరిశుద్ధమగు నాచారము గల యజమానుఁడు. కుండము నందలి యగ్నివలన సోమమునుండి - దాని నాస్వాదించి సోమపుఁడై పవిత్రుడగును. ఈయంతర్యాగమున మాత్రము కాలనియమములేక మూలాధారమను కుండమునందలి యగ్ని (ప్రాణాగ్ని) నిత్యమును జాగరూకమై యుండుటవలన - యజమానుఁడగు యోగి ముందే పవిత్రుఁడై, శిరస్సునుండి స్రవించుచున్న సోమరసము నాస్వాదించి సోమపుఁడగునని భావము.

మూ॥ చిన్మయీ పిబసి సోమమిమం కిమ్
సోమ ఏవ కిమసౌ వసి మాతః!
పేయసే పిబసిచ స్వయమేకా
పేయపాత్ర్యయుగలంకిముభూత్వా ॥ 11

మాతా! చిన్మయివై (భో(క్త్రివై) నీవు ఈ సోమమును ద్రావుచున్నావా? (లేక) త్రాగఁబడుచున్న యీ సోమమేనీవా? ఒక్కతెవే యగు నీవు స్వయముగా పేయమవై (త్రాగఁబడు రసమై) త్రాగఁబడుచు; పాత్రివై (త్రాగుదానవై) త్రాగుచు, ఉన్నావా? (నీవు త్రాగుదానవా? త్రాగఁబడురసమనా? లేక రెండును నీవా?)

ప్రభ:– సోమము – సహస్రారము నుండి స్రవించుచున్న రసము. (నీవే పాత్రివి', 'పేయమవు' అగుచు ఉభయధర్మము నవలంబించుచున్నావా?) చిన్మయివగు నీకొక్కతికే భోక్తృత్వము – భోగ్యత్వము కలుగుచున్నదా? అని భావము.

మూ॥ తైజసం కనక మగ్నివితప్తం
తేజ ఏవకనకాఙ్గి! యథాస్యాత్
మోదరూపకలయా తవతప్తం
తన్మయం భవతిమోదజ పిణ్డమ్ ॥ 12

కనకాంగీ! అగ్నిచే విశేషించి తప్తమైన తైజసమగు (తేజోమయమగు) కనకము – తేజమేయగునట్లు – నీయానందస్వరూపాంశము చేత తప్తమగు (తపస్సుచేత సాధింపఁబడి సంస్కరింపఁబడిన) ఆనందజాతశరీరము – ఆనందమయమేయగును.

ప్రభ:– గనియందు పుట్టిన తేజస్సే – కనకమని చెప్పుదురు. కావున తైజసమగు కనకము అగ్ని చేత బాగుగా కాల్పఁబడి (మరల) తేజస్సేయగునట్లు–

'' ఆనన్దాద్ధ్యేవఖల్విమాని భూతానిజాయన్తే''

'' ఆనందమునుండియే యీ ప్రాణులు పుట్టుచున్నారు'' అను శ్రుతివలన, ఆనందము నుండి జనించిన శరీరము – నీయానందకల చేతనే సంస్కరింపఁబడి ఆనందమయమే యగునని తాత్పర్యము. (యోగానుభవ సంపన్నుఁడగు మహాకవి పూర్వోక్తశ్లోకములందు వలె నిందును, మీదిశ్లోకముల యందునుగూడ స్వానుభూతిని ప్రదర్శించుచున్నాఁడని తెలియునది. ఇదియంతయు యోగిదృష్టమేయగును.



మూ॥ కాఽపి మోదలహరీ తవవీచి
ర్నిర్గతా దశశతారసుధాబ్ధేః
పూరయత్యఖిలమమ్బ! శరీరం
నేహ వేద్మి పరమే జడభాగమ్ ॥ 13

ఉత్తమురాలవగునో అమ్మా! (దశశతారసుధాబ్ధినుండి) సహస్రారమను సుధాసాగరము నుండి వెలికి వచ్చిన నీయొక్క ఆనంద లహరియగు, నొకానొకతరంగము – (నా) శరీరము నఖిలమునుగూడ (ఆత్మచేత) నిండించుచున్నది. నేను – ఈ దేహమునందు జడమగుభాగమును (అచేతనాంశమును) తెలిసికొనకున్నాను.

ప్రభ:–దశశతారసుధాబ్ధి = సహస్రారమను నమృతసముద్రము. సహస్ర+ అర+ కమలము = పదివందల రేకులు గలది. ఆ సహస్రారకమలము నుండి నిర్గమించి, నాశరీరము నంతనుగూడ ఆత్మచేత నింపుచున్న నీయానందసుధావీచిక వలన – 'నా శరీరమంతయు చిన్మయమే' అను అనుభవము కలిగించు అనిర్వచనీయమగు దశ నాకు గలిగినదని భావము. (సహస్రారచక్రము నుండి ఇట్టిదని చెప్పుటకు వీలుపడని యేదోయొక ఆనందతరంగము నాశరీరమునంతను స్వరూపానందముతో నింపుచున్నపుడు అమృతానంద ప్రపూర్ణమయిన యీ శరీరమునందు – ఏది జడమో, ఏది చేతనమో, తెలిసికోరాని తన్మయస్థితి గలుగుచున్నదని భావము)

మూ॥ సేయ ముత్తమతమా నిపతన్తీ
శీతలాద్ దశశతార పయోదాత్
ప్రేరితాదఖిలరాజ్ఞి! భవత్యా
బుద్ధిసస్యమవతా ద్రసవృష్టిః ॥ 14

అఖిలరాజ్ఞీ! నాచేత నిప్పుడనుభవింపఁబడుచున్న ఉత్తమతమగు రసవృష్టి- భగవతివగు నీచేత ప్రేరణముచేయబడినదై, శీతలమగు సహస్రారపయోదమునుండి క్రిందికి ప్రసరించుచున్నది. ఈ రసవృష్టి- బుద్ధిసస్యమును ( బోధమనుధాన్యమును) రక్షించుఁగాత!

**ప్రభ:**- శరీరమను క్షేత్రమునుండి యుదయించిన జ్ఞానమనుసస్యమును, సహస్రారమేఘమునుండి నిపతితమగుచున్న రసమనువర్షము - కాపాడుఁగాతమని యర్థము. శరీరమును క్షేత్రముగాను, జ్ఞానమును సస్యముగాను, రసమును వర్షముగాను జెప్పుటవలన నిందురూపకము స్పష్టమగుచున్నది.

మూ॥ దుగ్ధ సిన్ధు మథనా దమృతంవా
శబ్దసిన్ధు మథనాత్ ప్రణవోవా
లభ్యతే సుకృతిభిస్తవవీచి
ర్మూర్ధకఞ్జమథనా ద్రస ఏషః ॥ 15

క్షీరసాగర మథనమువలన అమృతమువలెను, శబ్దసాగరమథనము వలన ప్రణవము వలెను, శిరః కమల మథనమువలన నీయానందవీచియగు ఈ రసము, పుణ్యవంతులకు లభించుచున్నది.

**ప్రభ:**- శిరఃకమలము = సహస్రారము. క్షీరసముద్ర మథనము వలన, తత్సారభూతమగు నమృతము లభించునట్లును, శబ్దసమూహ పరిశోధనము వలన తత్సారమగు ఓంకారము లభించునట్లును, <u>సహస్రారమథనము వలన నీయానందకలయగు సోమరసము లభించునని భావము.</u>

మూ॥ అస్థిషు ప్రవహతి ప్రతివేగం
మజ్జసారమమృతం విదధానా
బిభ్రతీమదమనుష్ణ మదోషం
మూర్ధకఞ్జ నిలయే తవధారా ॥ 16



శిరః కమలనిలయవగు జననీ! నీసోమరసధార - అస్థులందున్న మజ్జాసారమగు ( ఎముకలయందలి సారమగు నేయి యొక్క సారమగు) అమృతమును విస్తరింపఁజేయుచు, అనుష్ణమును, అదోషమును అగుమదమును ( బోధవిశేషమును) ధరించుచు, ప్రతివేగమునందును ప్రవహించుచున్నది.

**ప్రభ:**- శిరః కమలనిలయ = సహస్రారమను కమలమున నివసించునది. మజ్జనశబ్దము నకారాంతమును, ఆకారాంత స్త్రీలింగమునుగూడ నగుచున్నది. మజ్జత్యస్థిషు ఇది మజ్జా= అస్థిసారః అనునదివ్యుత్పత్తి. ''మదము'' = బోధ విశేషము. లేక మత్తు, లోకసామాన్యమగుమదము - మరపునుకలిగించుట యను దోషముతోఁ గూడినదియు, తాపమును గలిగించునది యగు ఉష్ణము (వేడి) తోఁ గూడినదియు నగుచున్నది. యోగాభ్యాసము వలన కుండలినీ శక్తి - ప్రబోధింపఁబడినపుడు, సోమరసధారాసముదితమగు మదము - ఒకానొక జ్ఞాన విశేషమై యున్నది. కావున నది దోషయుక్తముగాని, ఉష్ణసహితముగాని కానేరదు. కావున నిందలి భావము నిట్లెఱుంగునది. 'నీయానందాంశమగు నీ సోమరసధార - తాను ప్రవహించుచున్నంత కాలమును మజ్జయొక్క సారభూతమగు నమృతమును విస్తరింపఁజేయుచు, నిర్మలమును, సుశీతలమును నగుచు, బోధ విశేషరూపమగు మదమును ప్రవహింపఁజేయుచుండును.''

మూ॥ తైత్తిరీయకథితో రసలాభః
సోఽయమేవ సకలాగమవర్ణ్యే!
ఏతదేవ శశిమణ్డలనాథే!
తన్త్రభాషిత పరామృతపానమ్ ॥ 17

సర్వవేదస్తుత్యవగు జననీ! ఇదియే ( ఇప్పుడనుభవింపఁబడుచున్నదియు, మజ్జయందు ప్రవహించుచున్నదియునగు సహస్రారసోమమే) తైత్తిరీయశ్రుతియందు కథితమగు రసలాభమగుచున్నది. ఓసోమమండలనాయికా! ఇదియే - తంత్ర శాస్త్రముల యందుఁ దెలుపఁబడిన, శ్రేష్ఠమగు అమృతపానమైయున్నది.

**ప్రభ:-** తైత్తిరీయోపనిషత్తునందు, ''రసోవైసః, రసంహ్యేవాయం లబ్ధ్వాఽఽనన్దీభతి'' ''రసమే-పరబ్రహ్మము. ఈ పురుషుఁడీరసమునే పొంది యానందముగలవాఁడగుచున్నాఁడు'' అని చెప్పబడిన రసము – సహస్రారము నందలి సోమరసమే అని తెలియునది. ఈ సోమరసాస్వాదనమే రసలాభమనియు సోమరసాస్వాదియగు పురుషుఁడే – ఆనందియనియు తెలియవలయును. వైదికులు– బహిర్యాగమున – సోమమనులతను దంచి, సోమరసమును పానము చేయునట్లు, తాంత్రికులలో నొకతెగకు సంబంధించిన వారగు కౌలాచారులు – దేవికి, బహిర్నివేదితమగు సురామృతము (కల్లును) పానముచేయుదురు. లోకమునందిట్లు వైదికులు యజ్ఞమునందు చేయుచున్న సోమరసపానమును, కౌలాచారులు చేయుచున్న దుష్టమగు సురాపానమును, సాత్త్వికములు (పారమార్థికములు) కావు. ఈ రెంటి యొక్క యుతత్త్వము – అదోషమును, అనుష్ణమును అగు, మదమను ఆనందలహరి ప్రవహింపఁజేయునదియగు సహస్రారమునందలి సోమరసముయొక్క అస్వాదనమే యనునది సిద్ధాంతము.

మూ॥ మూర్ధసోమమజరామర రూపే
యుక్త వీక్షణక రేణనిపీడ్య
శమ్భు సున్దరి! సునోమిధినోమి
త్వాం ప్రదీప్తకులకుణ్డ నిశాన్తామ్ ॥ 18

అజరామర రూపిణీ! శివసుందరీ! (రసవంతమగు) శిరస్సునందలి సోమమును, యోగస్థితమగు వీక్షణమను హస్తము చేత పిండి – సవమును (యజ్ఞమును) చేయుదును. ప్రదీప్తమగు కులకుండాగ్నియందు నివసించుచున్న నిన్ను తృప్తినొందఁజేయుదును.

**ప్రభ:-** (సవము) ''సూయతే సోమోఽస్మిన్నితి సవః'' దీనియందు సోమము తడుపఁబడును – గావున యజ్ఞము – సవమని చెప్పఁబడును. కులకుండాగ్ని = 



మూలాధారమునందలి యగ్ని. యజమానుఁడు – యాగము నొనర్చునపుడు, అభిషవణఫలకమునందు (సన్నికంటియందు) సోమమును నూరి, రసమును పిండి – సవము (యజ్ఞము) నొనర్చునట్లు, నేను శిరస్సునందలి సోమమును యోగదృష్టి చేత గదలించి, తదుపరి రసమునుగొని, సవమునొనర్చి, మూలాధారస్థితవగు నిన్నుతృప్తినొందింతునని భావము. హస్తము బహిర్యాగమున నిష్పీడనసాధనమగునట్లు యోగదృష్టి – యీ యంతర్యాగమున నిష్పీడన సాధనమగుచుండును. ఇట్లు – అగ్నీషోమీయమను అంతర్యజ్ఞము – నాచేఁ గావింపఁబడుచున్నదని తాత్పర్యము.

మూ॥ దృష్టిరేవ రవిధీధితి రుగ్రా
శీర్ష కఞ్జ శశినం ప్రవిశన్తీ
శీతలామృతమయీ ఖలుభూత్వా
యోగినో ద్రవతి మోదకలాతే ॥ 19

యోగదృష్టియను ప్రచండమగు సూర్యధీధితి – సహస్రార కమలస్థుఁడగు సోమునియందు ప్రవేశించి శీతలామృతమయియై నీ యానందకళయగుచు స్రవించుచుండును.

**ప్రభ:-** ధీధితి = కాంతి, చంద్రునకు స్వయంప్రకాశము లేదు. ఉష్ణమగు సూర్యకాంతియే, చంద్రబింబమునందు ప్రతిఫలించి శీతలమై వెన్నెలయగుననునది – జ్యోతిశ్శాస్త్ర సిద్ధాంతము. దేవియే – మొదట యోగి యొక్క యోగ దృష్టియై సహస్రారమునందుఁ బ్రవేశించి, తరువాత, శీతలామృతమయి యగు ఆనందలహరిని ధరింపఁజేయునని భావము.

మూ॥ మూర్ధని ద్రవసి యోగ యుతానాం
చక్షుషి జ్వలసి శఙ్కరభామే!
తిష్ఠసిస్థిరపదా కులకుణ్డే
బాహ్యతఃస్ఫలసి నైవకదాఽపి ॥ 20

ఓ శివప్రియా! యోగయుతుల (నిత్యయోగుల) శిరస్సున (సోమ స్వరూపిణివై ద్రవించుచుందువు వారి దృష్టియందు (దృష్టి వైజ్వలించుచుందువు. కులకుండమునందు స్థిరపదవై యుందువు.

(ఈ స్థానముల కంటె) వెలుపల నెప్పుడును గూడ చ్యుతినొందవు.

**ప్రభ:-** స్థిరపదవై = స్థిరమగు స్థానము గల దానవై, కుల కుండము = మూలాధారము, చ్యుతినొందవు = తప్పివసింపవు. నిత్యయోగుల శిరోఉక్షి మూలాధారముల యందు స్థిరపడిన నీవు వానినుండి యెన్నఁడును తొలగవని భావము.

మూ॥ సాయది ద్రవతి మోదకలా స్యాత్
సాయది జ్వలతి చిత్ కలికా స్యాత్
సాపరా స్థిరపదా యదితిష్ఠ
త్యక్షరా భవతి వాచనసత్తా ॥ 21

ఆ దేవి – ద్రవించునెడల ఆనందకలయగును. ఆ దేవి – జ్వలించునెడల చిత్ కలిక యగును. ఆ పరదేవత – స్థిరపద యగునెడల అక్షరయగు నొకానొక సత్తయగును.

**ప్రభ:-** ఆనందకల – ఆనందాంశము – ఆనందమయి. చిత్ కలిక = చిత్తేయగు కలిక – చిన్మయి. సత్తా = ఉనికి గలది. సతి. ఒక్క తేయేయగు పరమేశ్వరి సోమాత్మికయై – ఆనందమయి, తేజోరూపిణియై చిన్మయి, అక్షరస్థితియై సతి, అగునని. క్రియా – స్థాన భేదము చేత త్రిత్వము చెప్పఁబడినను – చిదానందమయియగుసతి – సర్వమును గూడ తానేయగునని భావము.

మూ॥ పశ్యతా నయన మణ్డలవృత్తిం
గృహ్యసే త్వ మచలాధిప కన్యే!
జానతా దశశతార విలాసం
స్పృశ్యసే విదితమమ్బ! రహస్యమ్ ॥ 22



అచలేంద్రకుమారీ! మండలాకారములగు నేత్రములవృత్తిని (దర్శనక్రియను) చూచుచున్న యోగికి నీవు లభించుచుందువు. (రసవర్ణాత్మకమగు) దశశతార విలసితమును (సహస్రార విలాసమును) గ్రహించుచున్న యోగి నిన్ను స్పృశించును. అమ్మా! రహస్యము తెలిసినది.!

**ప్రభ:-** రసవర్ణాత్మకము = సోమరసమును వర్షించుట స్వరూపముగా గలది, దశశత + అర + విలసితము = పదివందల దళములు గల సహస్రారము యొక్క విలాసము. దృష్టికి ద్రష్టయగు యోగికి నీవులభింతువని యర్థము. దృష్టుపాసనము చేత చిన్మయివగు నీయొక్క సాక్షాత్కారమును, సహస్రారామృతదానము చేత ఆనందమయివగు నీయొక్క ప్రాప్తియు, యోగికి సిద్ధించును. ఈ రహస్యమునే నిప్పుడెఱిఁగితినని భావము.

మూ॥ వ్యాప్తశక్త్య సుబలేన లసన్తీ
భానుబిమ్బనయనేన తప న్తీ
చన్ద్రబిమ్బ మనసా విహరన్తీ
సాపునర్జయతి మూర్ధ్నివసన్తీ ॥ 23

వ్యాపించిన శక్తియగు ప్రాణబలము చేత వ్యాపారము నొనర్చునదియు, భానుబింబమగు నేత్రముచేత తపము నొనర్చునదియు; చంద్రబింబమగు మనస్సు చేత విహారము నొనర్చునదియు నగు దేవి – మరల దేహమునందలి సహస్రారమున వసించుచు జయించుచున్నది.

**ప్రభ:-** పరమేశ్వరికీ బ్రహ్మాండమున వ్యాపించిన శక్తియే – ప్రాణము. సూర్యుఁడే – కన్ను. చంద్రుఁడే – మనస్సు. ''చన్ద్రమా మనసోజాతః చక్షోః సూర్యో అజాయత'' అను శ్రుతిచేత, సూర్యుఁడు నయన స్వరూపుఁడనియు, చంద్రుఁడు మానస స్వరూపుఁడనియు, దెలియుచున్నది. ఏతత్ కవికూడ స్వవిరచితమగు శివ శతకము నందీయంశము నిట్లు తెలిపియున్నాఁడు. ''సౌరం మణ్డలముజ్జ్వలంతవ తపః,

శ్వాసశ్చరన్ మారుతః'' సూర్యమండలము = ఉజ్వలమగు నీతపస్సు. చరించుచున్న వాయువు – నిశ్వాసము. ఆదిత్యుఁడు – తపస్సు – ఛక్షుస్సు – కూడ నగునను అంశము శ్రుతియందుఁగూడ ప్రతిపాదింపఁబడినది. ఇట్లు – బ్రహ్మాండ శరీరయగు భగవతి పిండాడమగు సహస్రారమునందుఁగూడ విలసిల్లు చుండునని భావము.

మూ॥ స్వాగతం సకలలోకనుతాయై
స్వాగతం భువనరాజ మహిష్యై
స్వాగతం మయిభృశం సదయాయై
స్వాగతం దశశతార మితాయై ॥ **24**

సకల జగద్ వందితయగు దేవికి – స్వాగతము. సర్వేశ్వర హృదయేశ్వరికి – స్వాగతము. నాయందు సదయమగు పరమేశ్వరికి – స్వాగతము. సహస్రార నివాసినియగు జననికి – స్వాగతము.

**ప్రభ:-** స్వాగతము = (మహాదేవి యొక్క శుభాగమన విజయము గోరునదియగు ప్రీతి గౌరవవచనము) దయచేయుము అను గౌరవము. సదయ = కరుణతోఁగూడినది. ఈదృశములగు యోగానుభూతుల ననుగ్రహించి స్వీయ కృపను ప్రదర్శించిన పరమేశ్వరికి స్వాగతము అని యర్థము. సర్వలోక సంస్తుతయు, సర్వేశ్వర నాయికయునగు పరమేశ్వరియే నాయందు దయబూని, నా సహస్రారమున విలసిల్లుచు, విజయము నొందుచున్నదని భావము. యోగియగు కవి పరమేశ్వరి – తన యందు శాశ్వతముగా నిలుచుట కీస్వాగత వచనమును స్తబకమును ముగించునపుడు సమర్పించెనని తెలియునది.

మూ॥ సత్కవిక్షితిభుజో లలితాభిః
స్వాగతాభి రనఘాభి రిమాభిః
స్వాగతం భణితమస్తు భవాన్యై
ఖేలనాయ శిర ఏతదితాయై ॥ **25**



సత్ (ప్రశస్త) కవి లోకరాజునకు సంబంధించిన దోష రహితులు, లలితలునగు ఈ స్వాగతల చేత ఈ శిరస్సు (సమస్రారకమలము) నందాడుకొనుటకు వచ్చిన భవానికి స్వాగతము చెప్పఁబడుఁగాత!

**ప్రభ:-** దోషరహితలు – దోషము లేనివి, లేక లక్షణసంపన్నలు, లలితలు= కోమలపదములు లేక సుందరగాత్రులు. స్వాగతలు = స్వాగతవృత్తములు లేక అనాయాసముగా వచ్చిన స్త్రీలు. ఇచట ప్రకృతార్థపరములగు పదముచేత సూచ్యార్థమగు స్తబకవృత్తమును సూచించుట వలన ఇది శ్లేషోత్థాపితమగు ముద్రాలంకారమగుచున్నది.

ఇది సవ్యాఖ్యమగు పంచదశ స్తబకము.

****